

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న సిఐ హిమగిరి

ప్రజాశక్తి - దుంబ్రిగుడ: మద్యం మత్తులో వాహనాలు నడిపితే వారిపై కఠిన తప్పదని అరకు సీఐ హిమగిరి హెచ్చరించారు. మంగళ వారం సాయంత్రం మండల కేంద్రంలోని చాపరాయి జలపాతం వద్ద వాహనాల తనిఖీ చేశారు .వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేసి, వాహన రికార్డులు, లైసెన్స్‌లు పరిశీలించారు.ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి జరిమానా, కేసులకు గురికావద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ కెపి.నాయుడు,పోలీసులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టుతో రాకపోకలకు కష్టాలు

- సిపిఎం ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు
- శ్రమదానం చేసిన గిరిజన యువత



సిపిఎం వైస్ ఎంపిపి ఆధ్వర్యంలో శ్రమదానంతో కుంగిన కల్వర్టును పూడుస్తున్న గిరిజన యువకులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : నిర్మాణంలో నాణ్యతాలోపం, దానికి తోడుగా పరిమితికి మించి లోడుతో భారీ వాహనాల రాకపోకలతో మండలంలోని కించాయిపుట్టు గ్రామపంచాయతీ లోని ధారపల్లి గ్రామ సమీపంలో కల్వర్టు కుంగిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. దీనిపై ఫోనులో సమాచారం అందుకున్న సిపిఎంకు చెందిన స్థానిక ఎంపిటిసి, మండల వైస్ ఎంపిపి-1 పాటుబోయి సత్యనారాయణ ఘటన స్థలానికి హుటాహుటిన వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పి మధు , బాలు ,శుక్లల్ , లోకినాథ్ , వసంత్ సోమేశ్ తదితరులు సమస్యను విన్నవించారు. దీనిపై స్పందించిన సత్యనారాయణ మాట్లాడుతూ కల్వర్టు కుంగిపోవడంతో కించాయి పుట్టు గ్రామపంచాయతీ పరిధిలోనిసుమారు 10 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయన్నారు. అధికారులకు సమాచారం తెలియజెప్పారు. వారు స్పందించి, మరమ్మతులు చేపట్టే సరికి ఆలస్యమై, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థితి ఉన్నందున ఈలోగా స్థానిక యువత సహకారంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. శ్రమదానంగా బ్రిడ్జి గోతిలో రాళ్లు నింపి , ట్రాక్టర్ సహాయంతో మట్టిని పోసి తాత్కాలిక రాకపోకల మార్గాన్ని ఏర్పాటు చేశామని మండల వైస్ ఎంపిపి సత్యనారాయణ తెలిపారు. కుంగిపోయిన బ్రిడ్జిని సంబంధిత పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఎంపిడిఒ, సచివాలయ సెక్రెటరీ, స్థానిక విఆర్ఒలు పరిశీలించి, బ్రిడ్జి పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించి తక్షణ మరమ్మతులకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ రోడ్డును ఆనుకుని ఉన్న దారపల్లి, ఇల్లోయ్ పొలం, రాములు, గడ్డిబంధ, వర్కుగూమ్మి గ్రామాలతో పాటు లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు కాలినడకన రాములు గ్రామంలో చేరి అక్కడ నుండి ప్రైవేటు వాహనాలలో వెళ్లాల్సి వస్తోందన్నారు. గర్భిణులు, బాలింతలు, రోగులతోపాటు మహిళలు, చిన్నారుల రాకపోకల కష్టాలను దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే మండల పరిషత్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఐటిడిఎ ముట్టడిని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు పులిబుజ్జి, కోట జయరాజు

ప్రజాశక్తి- విఆర్‌పురం: పోలవరం బాధితుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 15న చింతూరు ఐటిడిఎ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని జెఎసి నాయకులు పులిబుజ్జి, కోట జయరాజు పిలుపునిచ్చారు. మంగళవారం వారు మాట్లాడుతూ రామవరం పంచాయతీ, చిన్నమట్టపల్లి పంచాయతీ నుండి అంతా కలసి వెళ్లి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించా లన్నారు. అధికారులు తాము ఎక్కడ చూపిస్తే అక్కడికి వెళ్లాలని చెబుతు న్నారని ఎవరిని అడగాలో అర్థం కాని పరిస్థితులు ఉన్నాయని దీనికి ఐటిడిఎ పిఒ, జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. ఇప్పటికే మూడు నెలల నుండి వరదలు వచ్చి ఇబ్బంది పడుతున్నామని తక్షణమే ప్యాకేజీ ఇచ్చి త్వరగా ఈ ప్రాంతం నుంచి పంపించాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గుటల ముత్యాలరావు, గుటల రమేష్, కోట్ల సాయిరామ్ పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు భూమికి భూమి ఇస్తాం

- నేలదోనెలపాడు ఆర్‌అండ్ఆర్ కాలనీ సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్
- ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజు, సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్ ఇతర అధికారులు హాజరు
- సమస్యల పరిష్కరిస్తామని హామీ



సమస్యలు వింటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -గంగవరం: పోలవరం ప్రాజెక్టు ముంపునకు దేవి పట్టణ మండలం కొండ మొదలు బాధితులకు అర్హులైన గిరిజనులకు ల్యాండ్‌టు ల్యాండ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అల్లూరి సీతారా మరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం గంగవరం మండలం నేలదోనెలపాడు ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ దినేష్‌కుమార్, రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్, సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా నేలదోనెలపాడు ఒకటిలో ఆర్అండ్ఆర్ కాలనీలో సమస్యలు తెలపమన్నారు. ఆర్ఎన్ఆర్ కాలనీలో వీధిలైట్లు, తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, యూపీ స్కూల్లో పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని, మరో అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని, రాజవరం నుండి నేలదోనెలపాడు వరకు రోడ్డు పనులు బీటి రోడ్డు ఏర్పాటు చేయాలని, రేషన్‌కార్డు లేనివారికి రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. 18 సంవత్సరాల నిండిన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. 2023లో జరాయితి భూములకు సంబంధించి డిపట్టాలు అందజే యడం జరిగిందని వీటికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కతనపల్లి గ్రామ గిరిజనులకు ప్యాకేజీ అమలు చేయాలన్నారు. ఇంకా పలు స్థానిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు విన్న కలెక్టర్ స్పందించి తహశీల్దార్లు, ఎంపిడిఒలు గ్రామసభల ద్వారా తీర్మానాలు తీసుకోవాలని ఆదేశించారు. సాధ్యమైనంతవరకు ల్యాండ్ టు ల్యాండ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు మౌలిక సదుపాయాలు పక్కాగా ఏర్పాటుకు చర్యలు చేపట్టిన జరుగుతుం దన్నారు. సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ మాట్లాడుతూ కొండ మొదలు పంచాయతీ ముంపు బాధితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా ల్యాండ్‌లాండ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.అంబేద్కర్, సతీష్, తహశీల్దార్లు సిహెచ్ శ్రీనివాసరావు, కరక .సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, ఎస్బివి రెడ్డి, సర్పంచ్ వేట్ల విజయ, ఇల్లా.రామిరెడ్డి, పీసా కమిటీ ఉపాధ్యక్షులు పాపారావు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఊయలల ధ్వంసంపై ఆందోళన

- అటవీ అధికారుల నిర్వాకంపై పోలీసులకు ఫిర్యాదు
- రెండు, మూడు రోజుల్లో ఉమ్మడి సర్వేకు డిఎస్‌పి హామీ



గిరిజనులతో మాట్లాడుతున్న డిఎస్‌పి అహ్మద్

ప్రజాశక్తి అరకులోయ రూరల్:పర్యాటక కేంద్రమైన మాడగడ మేఘాలకొండ, సన్ రైజ్ పాయింట్‌లో స్వయం ఉపాధి కోసం నిర్మించిన ఉయ్యాలను గిరిజనులు అనుమతి లేకుండా అటవీ శాఖ అధికారులు ధ్వంసం చేయడంపై స్థానిక గిరిజనులు ఆందోళన చేపట్టారు. బాధ్యులపై వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఐకి వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన పాడేరు డిఎస్‌పి షేక్ షాహబాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో అరకులోయ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం గిరిజనులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గిరిజనుల ఆందోళన, వారి సమస్యలను డిఎస్‌పి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా .గిరిజనులు,పంచాయతీ పెద్దలు మాట్లాడుతూ మాడగడ మేఘాలకొండ, సన్‌రైజ్ పాయింట్‌ల వద్దనిత్యం వందల మంది పర్యాటకులు వస్తుంటారని, అక్కడ గిరిజనులు వివిధ స్టాల్స్ టీ, టిఫిన్ సెంటర్లు, టెంట్ ఏర్పాటు చేసుకుని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారన్నారు. గిరిజనుల జీవన ఉపాధి కోసం నిర్మించుకున్న దుకాణాలు, ఉయ్యాలలను అటవీశాఖ అధికారులు ధ్వంసం చేశారన్నారు. మేఘాల కొండపై ఉయ్యాల, థింసా నత్యాలు సందడిలో పాల్గొనేందుకు వచ్చిన పర్యాటకుల నుంచి వచ్చే రాబడితో అనేకమంది జీవనం సాగిస్తున్నారన్నారు .పంచాయతీ ఆధ్వర్యంలో మేఘాలకొండ ,సన్రైజ్ పాయింట్ కొనసాగించాలని, ఎకో టూరిజం తమకొద్దు అంటూ గిరిజనులు ముక్తకంఠంతో తమ వ్యతిరేకతను తెలిపారు.

దీనిపై డిఎస్‌పి షేక్ షాహబాజ్ అహ్మద్ స్పందిస్తూ, గిరిజనుల సమస్యలపై పాడేరు ఐటిడిఎ పిఒ, జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి జాయింట్ సర్వే నిర్వహించి మేఘాలకొండపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులను నష్టపోకుండా లబ్ధి చేకూర్చేలా చూసుకుంటామని హామీ ఇచ్చారు. రెండు మూడు రోజులు సమయం కావాలని కోరారు. దీంతో గిరిజనులు ఆందోళన విరమించారు.



అటవీ అధికారుల తీరుపై ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న గిరిజనులు

మద్యం దుకాణాలపై గట్టి నిఘా

ప్రజాశక్తి పాడేరు : మద్యం నాణ్యత, అక్రమ అమ్మకాలపై పటిష్టనిఘా పెట్టి తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నట్లు పాడేరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆధారి సాంగ్ తెలిపారు.అల్లూరి జిల్లా ఉన్నతాధికారులు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు, మద్యం అక్రమ అమ్మకాలపై దాడులు చేస్తున్నామన్నారు. స్టేషన్ పరిధిలోని 9 మద్యం దుకాణాలపై మంగళవారంఆకస్మిక తనిఖీలు చేశామని,ఎటువంటి ఉల్లంఘనలు కానరాలేదని స్పష్టం చేశారు.కాగా గత అక్టోబర్ నుంచి ఇప్పటివరకు పాడేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 63 బెల్టుషాపులపై దాడుల కేసుల్లో 63 మంది ని అదుపులో తీసుకొని వారి వద్ద నుండి 96.56 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే వైన్ షాపుల్లో విక్రయాలపై అప్రమత్తంగా ఉండి, ఇప్పటివరకు వంద మద్యం నమూనాలను సేకరించి విశ్లేషణకు పంపామన్నారు. మద్యం అమ్మకాల్లో అక్రమాలు, బెల్ట్‌షాపులపై నిరంతరం నిఘా, తనిఖీలు కొనసాగిస్తామని, పట్టుబడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం అమ్మకాలు, బెల్ట్‌షాపులపై సమాచారముంటే తెలియజేసి సహకరించాలని సిఐ కోరారు.

హైడ్రో ప్రాజెక్టులకు వ్యతిరేకంగా

17న 'చలో కలెక్టరేట్'

గ్రామాల్లో పోరాట కమిటీ ఆధ్వర్యాన విస్తృత ప్రచారం



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి-అనంతగిరి : హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఈనెల 17న అల్లూరి జిల్లా కలెక్టరేట్ ముట్టడి ఆందోళనను విజయవంతం చేయాలని కోరుతూ రాష్ట్ర హైడ్రో పవర్ వ్యతిరేక కమిటీ పిలుపు మేరకు మండల పోరోట కమిటీ నేతలు మంగళవారం వేంగడ. పైనంపాడు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. పోరాట కమిటీ జిల్లా సభ్యులు మజ్జి. సురేష్, జి .అప్పలనాయుడు ఆధ్వర్యంలో వేంగడ పంచాయతీ గద్యయావలస, వేంగడ, మెట్టువలస .గోమంగిపాడు, పైడంపాడు పంచాయ.కాంగుపుటు.పనసలవర, పైనంపాడు, దిగువశోభ, హుకుంపెట మండలం మజ్జివలస, బూర్జ, సలితం, జంబువలస తదితర గ్రామంలో ప్రచారం చేశారు. చలో ఐటిడిఎ ముట్టడికి అధిక సంఖ్యలో గిరిజనులు హాజరై హైడ్రో పవర్ ప్రాజెక్టుపై తమ వ్యతిరేకతను ప్రభుత్వానికి అధికారులకు తెలియజెప్పాలన్నారుకార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యులు మల్లేష్, కామేశ్వరరావు,శంకర్ .తదితరులు పాల్గొన్నారు.

నేవీ మారథాన్‌లో తన్యకు స్వర్ణం

సత్తా చాటిన శారదా నికేతన్ విద్యార్థిని



జీవనతన్యను అభినందిస్తున్న హెచ్ఎం తదితరులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విశాఖపట్నంలో నిర్వహించిన నేవీ వైజాగ్ మాథరన్‌లో ఐదవ కిలోమీటర్లు పరుగు పందెంలో అరకులోయ శారద నికేతన్ విద్యార్థిని కొర్ర జీవన తన్య సత్తాచాటి బంగారు పతకం కైవనం చేసుకుంది. సాధించి మొదటి స్థానం నిలిచింది. అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ లిట్టిగూడ గ్రామం సాధారణ మధ్య తరగతి కుటుంబానిఇ చెందిన కొర్ర జీవన తన్య అరకులోయ మండలం శారద నికేతన్ పాఠశాలలో మూడోతరగతి చదువుతుంది.ఈ నెల 12న అరకు చలి ఉత్సవ్‌లో పరుగుల పందెం లో మొదటి స్థానం, తలసీమ రన్ ఐదవ రన్‌లో మొదటి స్థానం, ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కిలోమీటర్లు రన్‌లో మొదటి స్థానం ,యూత్‌ఫెస్ట్ మాథరన్‌లో రెండోస్థానంలో నిలిచింది. మారథాన్‌లో సత్తా చాటిన జీవన తన్యను శారద ట్రస్టు సభ్యులు, శారద నికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవులు, పాఠశాల సిబ్బంది అభినందించారు .ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిన్నవయస్సులో ఆటలపోటీల్లో సత్తాచటి బంగారు పతకం సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావడం గర్వంగా ఉందని కొనియాడారు. ఇలాంటి బంగారు పతకాలు మరెన్నో జీవన తన్య సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తండ్రి కొర్ర సుబ్బారావు,స్కూల్ సిబ్బంది ,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మారథాన్‌లో సింహాద్రికి స్వర్ణం

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: ఇండో నేపాల్ యూత్ గేమ్స్, ఐదు కిలోమీటర్ల మారథాన్‌లో మండలంలోని గిరి విద్యార్థి సింహాద్రి సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించాడు .మండలంలోని కంబవలస గ్రామానికి చెందినకోనేపు కొండబాబు, అప్పలమ్మ దంపతులకు మొదటి సంతానం కోనేపు సింహాద్రి. ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు కంభవలస స్కూల్లో చదువుకుని, ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు చిన్న ముషిడివాడ స్కూల్లో చదువు కున్నాడు. ఇంటర్మీడియట్ పెదబయలు ఏపీఆర్ జేసిలో చదువుకున్నారు. విశాఖపట్నం కృష్ణ కాలేజీలో డిగ్రీ చదువుకున్నారు. డిపిడి కొత్తవలస ప్రగతి కాలేజీలో చదువుతున్నాడు.తల్లిదండ్రుల ప్రోత్సాహంతో, స్నేహితుల ప్రోత్సాహంతో ఇండోనేపాల్ యూత్ గేమ్స్ పాల్గొన్నాడు. ఐదు కిలోమీటర్ల మారథాన్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. నిరుపేద వ్యవసాయ కుటుంబం నుంచి కష్టపడి గోల్డ్ మెడల్ సాధించడంపై తల్లి దండ్రులు,గ్రామస్తులతో పాటు మండలంలోని పలువురు ఆయనను అభినందించారు. సింహాద్రికి ఆర్థికంగా ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ మల్లేశ్వరరావు

కస్తూర్బా బాలికా విద్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-గంగవరం: కొత్తాడలో కస్తూరిబా బాలికల పాఠశాలను ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మేటివ్ టు పరీక్షల నిర్వహణ పరిశీలించి ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. శతశాతం విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అనంతరం పాఠశాల రికార్డులు, రిజిస్టర్స్ పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

1600 కిలోల రేషన్ బియ్యం సీజ్



రేషన్‌బియ్యం పరిశీలిస్తున్న తహశీల్దార్ సత్యనారాయణ

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: మండలంలోని అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని లాగరాయిలో తహశీల్దార్ అల్లు సత్యనారాయణ మంగళవారం పట్టుకున్నారు. లాగరే గ్రామంలో బియ్యం రవాణా అవుతుందనే సమాచారంతో తహశీల్దార్ సత్యనారా యణ, విఆర్ఒ మురళి దాడులు నిర్వహించి పట్టుకున్నారు.

రేషన్‌బియ్యం తరలిస్తున్న పెద్దాపురం మండలానికి చెందిన కోరుకొండ అచ్చిరాజుపై కేసు నమోదు చేసి వ్యాన్ సీజ్ చేయడంతో బాటు, పట్టుకున్న రేషన్ బియ్యాన్ని జిసిసి గోదాంకు తరలించారు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి-సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి దిగువ సీలేరు డొంకరాయి జలాశయం నుంచి 1000 క్యూసెక్కుల నీటిని మంగళవారం నుంచి దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నట్లు ఎపి జెన్కో అధికారులు వెల్లడించారు. డొంకాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా డొంకరాయి ఎగువన గత మూడు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు జలాశయంలో నీటిమట్టాలు క్రమేపీ పెరుగుతున్నాయి. మంగళవారం నాటికి జలాశయం నీటిమట్టం1036.50 అడుగులకు చేరింది. దీంతో జెన్కో అధికారులు అప్రమత్తమయ్యారు. 1036.50 అడుగులు వద్ద జలాశయం స్థిరంగా నీటిమట్టం కొనసాగేలా పర్యవేక్షణ చేస్తున్నారు. ఇందులో భాగంగానే 6వనెంబర్ గేటుద్వారా 0.84 అడుగులకు గేటుఎత్తి దిగువ ప్రాంతానికి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాంప్లెక్స్ పరిధిలోని మోతుగూడెం జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జెన్కో అధికారులు తెలిపారు. డొంకరాయి నదీపరివాహక చుట్టుపక్కల నుంచి ఐదువేల క్యూసెక్కులు వరకు వరదనీరు (ఇన్ఫ్లోస్) వచ్చి చేరుతోందని తెలిపారు.




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు, సర్పంచ్ నాగమణి

నష్టపరిహారం అందేదెప్పుడు?

ప్రజాశక్తి-కూనవరం: పోలవరం బ్యాక్‌వాటర్ వల్ల నష్టపోయిన రైతులకు, నిర్వాసితులకు పంట నష్టపరిహారం, ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం ఎప్పుడు అందిస్తారని సిపిఎం జిల్లా కమిటి సభ్యురాలు, సర్పంచ్ మడకం నాగమణి ప్రశ్నించారు. మండలంలోని పార్టీ ఆవుల నాగమయ్య భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక వర్షాలతో మండల వ్యాప్తంగా ఉన్న రైతులు, ప్రజానీకం అంతా వ్యవసాయ పనులు లేక, ఇతర ఏ విధమైన ఉపాధి లేక ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం స్పందించి వరద సహాయాన్ని వెంటనే అందించాలని .లేనిపక్షంలో ముంపు మండల ప్రజలను ఏకం చేసి ఉద్యమాలు చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసరావు,తెల్లం తమ్మయ్య, పట్టణ శాఖ కార్యదర్శి కొండ ఈశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కలెక్టర్‌ని కోరిన ఎమ్మెల్యే శిరీషాదేవి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రంపచోడవరం డివిజన్ వ్యాప్తంగా అనేక రకాల మౌలిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని క్రమపద్ధతిలో పరిష్కారం చేయాలని రంప చోడవరం ఎమ్మెల్యే, మిరియాల శిరీషదేవి కోరారు. ఈ మేరకు మంగళవారం ఐటిడిఎ కార్యాలయానికి విచ్చేసి కలెక్టర్ దినేష్‌కుమార్‌ని కలిశారు కలిశారు. రాజవొమ్మంగి మండలంలో కొన్ని రహదారులు, అడ్డతీగల మండలం కొత్తూరు నుండి బందమామిళ్ళువరకూ రోడ్డు సౌకర్యం మెరుగుపర్చాలని, విలీన మండలాల గోదావరిముంపుపై క్షుణ్ణంగా వివరించి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. అటవీశాఖ అనుమతులు లేక ఇబ్బందిగా ఉందని త్వరితగతిన చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో పిఒ బి.స్మరణ్ రాజ్, సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్ ఉన్నారు. ఆమె వెంట రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాన్, మారేడుమిల్లి మండలపార్టీ అధ్యక్షులు గురుకు శేషుకుమార్, కర్రిసన్యాసిరెడ్డి, మాజీ సర్పంచ్ వై. నిరంజనీదేవి, జనసేన మారేడుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు మళ్ళ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నదానం

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు జలవిద్యుత్ కేంద్రం సమీపంలో వెలసిన వనదుర్గ ఆలయంలో మంగళవారం మోటార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

దల్లాపల్లి, చీకుమద్దుల తారురోడ్డు నిర్మాణంలో అలసత్వంపై

17న చలో పాడేరు ఐటిడిఎ

ప్రజాశక్తి- హుకుంపేట: దల్లాపల్లి, చీకుమద్దుల తారురోడ్డు నిర్మాణంలో అలసత్వాన్ని నిరసిస్తూ ఈనెల 17న శుక్రవారం చలో ఐటిడిఎ ఆందోళనను జయప్రదం చేయాలని స్థానిక వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు పిలుపునిచ్చారు. ఈమేరకు పలు గ్రామాల్లో కరపత్రాలను పంచుతూ విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ, దల్లాపల్లి, చీకుమద్దుల రోడ్డు నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం రూ.3కోట్ల ఉపాధిహామీ పథకం నిధులు మంజూరయ్యాయన్నారు. అయితే చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా నిర్మాణం నిలిచిపోయిందన్నారు. దీంతో కల్వర్టులు, మెటల్, కాంక్రీట్ పనులు పూర్తికాక రహదారి దారుణ స్థితికి చేరిందన్నారు. వాహనాలు తిరగలేని పరిస్థితి ఏర్పడడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని, అనారోగ్య సమస్యల సందర్భంలో డోలీమోతలతోనే రోగులను తరలిస్తున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యంతో చీకుమద్దుల పంచాయతీ పరిధిలోని 12 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని నిరసిస్తూ ఈనెల 17న పాడేరు ఐటిడిఎ ముట్టడి ఆందోళన చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ తారురోడ్డు నిర్మాణం పూర్తయితే దల్లాపల్లి, బూరుగుచెట్టు, అలీవరం, వంతాడపల్లి మీదుగా అరగంటలో పాడేరు చేరుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడిగుంట పీసా ఉపాధ్యక్షుడు జన్ని అప్పలస్వామి, పెద్దగందిపుట్టు గ్రామపెద్ద మర్రి సుబ్బారావు, గ్రామనాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో మన్యం పాత్రికేయులు

- ఆశ్రమ విద్యార్థులకు ప్లాస్కుల పంపిణీ


ప్లాస్కులు పంపిణీ చేస్తున్న విలేకర్లు

ప్రజాశక్తి- హుకుంపేట: సామాజిక సేవలో మేము సైతం అంటూ హుకుంపేటలోని గిరిజన విలేకర్లు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల సేవా సంఘం ఆధ్వర్యంలో హుకుంపేట గిరిజన ప్రాథమికోన్నత బాలుర మండలంలోని మఠం పంచాయతీ ఆనాథాశ్రమంలో 80 మంది విద్యార్థులతో పాటు సిబ్బందికి మొత్తం 90 ప్లాస్కులను పంపిణీ చేశారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు పి..సూర్యారావు మాట్లాడుతూ, విలేకర్లుగా వార్తాసేకరణతోపాటు సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలనే తలంపుతో ప్రస్తుతం పిల్లల ఆరోగ్య రక్షణకుప్లాస్కులను పంపిణీ చేశామని తెలిపారు. రానున్న శీతాకాలంలో వేడి నీళ్లు తాగేందుకు ఉపయోగపడతాయనే తలంపుతో వీటిని అందజేశామన్నారు.

ఇదే ఆశ్రమ పాఠశాలలో జిసిసి రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ జన్మదిన వేడుకలను టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు మత్స్య రాజు, డివిజన్ ట్రెజరర్ సునీల్, జిల్లా ఉపాధ్యక్షులు హుకుంపేట మండల అధ్యక్షులు ఆనంద్, కార్యదర్శి గంగాధర్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ట్రెజరర్ పండు, గౌరవ అధ్యక్షులు గణేష్, అఖిల్ సభ్యులు శ్రీను, టిడిపి నాయకులు బాకూరు సర్పంచ్ వెంకటరమణరాజు, శశిభూషణ నాయుడు, మాజీ సర్పంచ్ కామేశ్వరరావు, ఎంపీటీసీ కొమ్మరమ్మ, మండల ప్రధాన కార్యదర్శి సూర్యకాంతం పాల్గొన్నారు.

వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి- హుకుంపేట: స్థానిక బెతస్థ ప్రార్ధన మందిరంలో సేవా భారత్ ఆధ్వర్యంలో వయోజన విద్యా కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. సేవా భారతి డైరెక్టర్, కోఆర్డినేటర్ ఇ.శ్యాంపాల్, సర్పంచ్ సమ్మెడ వెంకటపూర్ణిమ, పంచాయతీ అధ్యక్షులు వండాలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే దిశగా, మారుమూల గ్రామాల్లోని వృద్ధులు, విద్య రాని వారికి అక్షరాలు నేర్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. హుకుంపేట మండలంలోని ఆరు గ్రామాలను గుర్తించి వయోజన విద్య పాఠశాలలను ఏర్పాటు చేశారు. చదువుకున్న స్థానికులను బోధకులుగా నియమించి, సంవత్సరం పాటు ఉచితంగా బోధన అందించనున్నారు. ఈ సందర్భంగా అభ్యాసకులకు పుస్తకాలు, పలకలు, బలపాలు, పెన్నులు, పెన్సిల్లు, బ్లాక్‌బోర్డులు, లైట్లు వంటి అవసరమైన విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్సన్ సిహెచ్. దైవకృప, ఫెసిలిటేటర్ ఎ.సాల్మన్ రాజ్, వయోజన విద్య బోధకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో గుబులు

●రాకపోకలకు వాహనదారుల అవస్థలు
●ప్రమాదాలు జరుగుతున్నా పట్టని అధికారులు

ప్రజాశక్తి-హుకుంపేట: హుకుంపేట మండలకేంద్రంలో ప్రధాన కార్యాలయాలకు వెళ్లే రోడ్లు గుంతమయంగా కావడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్‌పై భారీ గుంతలు ప్రమాదభరితంగా ఉన్నాయి. ప్రతిరోజూ ఈ మార్గం గుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులు, అంబులెన్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డంతా అస్తవ్యస్తంగా మారిపోయింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు స్పందించకపోవడంతో రహదారి అధ్వాన్నంగా మిగిలిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి గుంతల్లో బైక్‌పై వెళ్లేవారు స్కిడ్అయి జారిపడడంతో పలువురు తీవ్రగాయాలు పాలైన ఘటనలున్నాయని స్థానికులు అంటున్నారు. మండల కేంద్రంలోనే రహదారుల పరిస్థితి ఇంటే, మారుమూల గ్రామాల్లో వీటి దుస్థితి చెప్పనలవికాదని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేసి, రాకపోకలకు యోగంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.


మండల కేంద్రంలో గుంతలమయమైన రహదారులు

వరద ఉధృతికి కొట్టుకుపోయిన కప్పల రోడ్డు


వరద ఉధృతికి కొట్టుకుపోయిన కప్పల రోడ్డు

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలో సోమవారం కురిసిన ఎడతెరిపి వర్షానికి వరద ఉధృతి కారణంగా మండలంలోని కప్పలబెన్నవరం, కప్పల గ్రామాల మధ్య రోడ్డు కొట్టుకుపోయింది. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తాజంగి పంచాయతీ పరిధిలోని కప్పలబెన్నవరం,

స్తంభించిన రాకపోకలు

కొత్తపాలెం పంచాయతీ కప్పల గ్రామాలను కలుపుతున్న ఈ రహదారి స్థానికులకు ప్రధాన మార్గం. పాఠశాలలు, వైద్యసేవలు, మార్కెట్ అవసరాల కోసం ప్రజలు ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారు. వర్షపునీటి ప్రవాహం బలంగా ఉండటంతో మట్టి రహదారి పూర్తిగా తెగిపోవడంతో వాహనాలు మాత్రమే కాదు, పాదచారులు సైతం వెళ్లే వీలు లేకుండా పోయింది. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుందని, అధికార యంత్రాంగం రోడ్డు పునర్నిర్మాణం చేస్తామని ఇస్తున్న హామీలు అమలు కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడు రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో తాము బయటకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుని కొట్టుకుపోయిన రోడ్డు పునరుద్ధరణ పనులను చేపట్టి రాకపోకలు జరిగేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్డు మరమ్మతులకు అత్యవసర నిధులు కేటాయించి తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కుటుంబ వారసత్వ మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో

నిర్లక్ష్యంపై గిరిజనం నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి : కుటుంబ వారసత్వ మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సబ్‌కలెక్టర్ చొరవ తీసుకుని సకాలం మండలానికి మారుమూల నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ. భూరిగ, .చిన్నకోనెల గ్రామాలకు చెందిన 18 కుటుంబాల గిరిజనులు మంగళవారం రెవిన్యూ అధికారులు ఇచ్చిన ఎకనాలెడ్జ్‌మెంట్ చేత పట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు సోమ్మెల .అప్పలరాజు మాట్లాడుతూ తమ కుటుంబ వారసత్వ మరణ ధ్రువీకరణ కోస రొంపిల్లి సచివాయలంలో గతనెల12- 18 తేదీలలో దరఖాస్తులు చేసుకున్నామని, నెలరోజులు గడిచినా సర్టిఫికెట్ల మంజూరులో ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇంటియజమాని మరణంలో ఆస్తి పంపకాలు, ఇఇతర లావాదేవీలో లీగల్ హెయిర్ అవసరమని, అయితే వీటి మంజూరులో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నామని . రేగు. మల్లయ్య రేగు. సన్నసమ్మ కోటపర్తి. జోగయ్య, ఇ.సన్యాసి, సోమ్మెల. గంగయ్య, సోమ్మెల. పైడయ్య తదితర 18 మంది తమ పనులు జరగడం లేదని వాపోతున్నారు.స్థానిక రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై జల్లా అధికారులు చొరవ చూపి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి ఆందోళన చేపట్టి, కలెక్టర్‌కు తమ గోడు వినిపిస్తామని హెచ్చరిస్తున్నారు.


నిరసన తెలుపుతున్న గిరిజనులు


రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

ఘనంగా జిసిసి చైర్మన్ శ్రావణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మాజీ మంత్రి, జిసిసి రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ జన్మదిన వేడుకలను మంగళవారం అరకులోయలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కిడారి శ్రావణ్ కుమార్ నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని కేక్ కటింగ్ చేసి పంపిణీ చేశారు. అరకు ఏరియా ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, ఫ్రూటీలు,పంపిణీ చేశారు. ఈ సందర్భంగారాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు,తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దన్నాయి రమేష్, మాజీ వైస్ ఎంపిపి పొద్దు అమ్మన్న, యూనిట్ ఇన్‌ఛార్జి వంతల డేవిడ్ మాట్లాడుతూ కిడారి శ్రావణ్ కుమార్ ప్రజల మన్ననలు పొందిన నాయకుడని, భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలు అధిరోహించాలన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అరకు నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు ఎలిబి కళావతి, మండల మహిళా అధ్యక్షురాలు వి ద్రౌపది, పట్టాసి సదానందం, దీన, కామేష్, సునీల్, విజయ్ కుమారి, సౌజన్య, సూకరమ్మ, బాలరాజు, ఉప సర్పంచ్ చిన్న, గుణనిధి, మండల ఉపాధ్యక్షుడు కూన రమేష్, నగేష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగునీరు

ప్రజాశక్తి-చింతపల్లి : గ్రామంలోని ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. పంచాయతీ పరిధిలోని గడపరాయి గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం నిధులు రూ.10 లక్షలతో తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులకు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావుతో కలిసి సర్పంచ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పలత మాట్లాడుతూ 10 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత తాగునీటి ట్యాంక్ గ్రామ ప్రజల అవసరాలను తీర్చగలదని పేర్కొన్నారు. పనులు నాణ్యతతో, సమయానికి పూర్తి అయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిముడు కృష్ణమూర్తి, అప్పారావు, నీటిపారుదల శాఖ జేఈ జి.స్వర్ణలత, వైసిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, కూటమి నాయకులు రుత్తల సత్యనారాయణ, షేక్ ఖాసీం వల్లి, అశోక్, వైసిపి నాయకులు కృష్ణ, లోవరాజు, శ్రీను, గంగన్నపడాల్ తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి బోర్డులు పెట్టాలి

ప్రజాశక్తి-చింతపల్లి : ప్రజలకు పారదర్శకంగా ధరలు తెలియజేయడం ప్రతి వ్యాపారీ బాధ్యత అని, దుకాణాల వద్ద జిఎస్‌టి తగ్గింపు బోర్డులు పెట్టాలని టిడిపి చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు అన్నారు. చింతపల్లి పట్టణంలో వివిధ షాపులను మంగళవారం ఆయన సందర్శించి జిఎస్‌టి అమలు తీరుపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక వస్తువులపై జీఎస్టీ శాతాన్ని తగ్గించిందని, కానీ చాలా చోట్ల ప్రజలకు ఆ సమాచారం తెలియజేయడం లేదని పేర్కొన్నారు. బోర్డులు లేకపోవడం వల్ల వినియోగదారులు ఎంత జీఎస్టీ చెల్లిస్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్టీ తగ్గింపులు అమల్లోకి వచ్చినప్పటికీ, కొందరు వ్యాపారులు పాత ధరలకే వస్తువులు విక్రయిస్తున్నారని ఆయన విమర్శించారు. తగ్గించిన పన్ను ప్రయోజనాలు నేరుగా వినియోగదారులకే చేరాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రుత్తల సత్యనారాయణ, అప్పారావు, ఖాసీం వల్లి, గాంధీ పడాల్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా బోధన చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేయాలని స్థానిక ఎంఇఒ ఎస్ సుందరరావు సూచించారు. మంగళవారం కురిడి పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా విద్యాబోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సులువుగా అర్థమయ్యే విధంగా బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోషక విలువలు గురించి అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కుమారి

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని నువ్వుమామిడి అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ కురసం అక్కమ్మ ఆధ్వర్యంలో పోషణమాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ కుమారి మాట్లాడుతూ పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కాయకూరలు, పండ్లు తినాలని సూచించారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు అందిస్తున్న సేవల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సౌజన్య, అంగన్‌వాడి వర్కర్ పాల్గొన్నారు.

ఒకేషనల్ ఎడ్యుకేషన్ నిర్వహణ పరిశీలన

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: ఎడ్యుకేషన్ ఒకేషనల్ విద్యా ప్రాముఖ్యత, తదితర అంశాలపై పాఠశాలలు సందర్శించి తనిఖీలు నిర్వహించామని జిసిడిఒ కవిత తెలిపారు. మంగళవారం మండలం లోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి ఒకేషనల్, ఎడ్యుకేషన్‌కు సంబంధించిన వాటి వివరాలు నిర్వహణ, తెలుసుకున్నామన్నారు ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ లాబ్స్ పరిశీలించారు. విద్యార్ధులకు,ట్రైనర్ లకు సూచనలు ఇచ్చారు. పిల్లలకు ఒకేషనల్ విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. దసరా సెలవుల్లో జరిగిన ఇంటర్న్షిప్ గురించి చర్చించారు. కార్యక్రమంలో హెచ్ఎం అజయ్‌కుమార్, పాఠశాల సిబ్బంది, ఒకేషనల్ టీచర్స్, నవీన్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

బాగా చదువుకుని ఉన్నత స్థానాన్ని అధిరోహించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని రాజవొమ్మంగి ఐసిడిఎస్ సిడిపిఒ సుజాత అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం నేపథ్యంలో మంగళవారం స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం నాగసుశీల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ సుజాత మాట్లాడుతూ బాల్యవివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ కోసం చైల్డ్‌హెల్ప్‌లైన్ నెంబర్, బాలికల హక్కులు చట్టాలు, పోక్సో చట్టం, ఎదిగే వయసులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు అమ్మిరాజు,పాఠశాల హెచ్ఎం నాగసుశీల, అంగన్వాడి వర్కర్లు వెంకటలక్ష్మి, కుమారి, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఎపిజివిబి సేవలు

ప్రజాశక్తి - కొయ్యూరు: ఈనెల 9వ తేదీ సాయంత్రం నుండి నిలిచిపోయిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలు సోమవారం సాయంత్రం నుండి పునరుద్ధరింపబడినట్లు ఖాతాదారులకు మెసేజ్‌లు వస్తున్నాయి. బ్యాంకు ఖాతానెంబర్లు, ఐఎఫ్ఎస్సి కోడ్ తదితర వివరాలను టెక్నికల్‌గా మార్పు చేసేందుకు బ్యాంకుసేవలు నిలిపివేయడంతో సేవలు నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు అసౌకర్యం ఎదుర్కొన్నారు. మంగళవారం కూడా పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు.

పాండురాజుకు సిపిఎం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి- విఆర్‌పురం: నిన్న జరిగిన నిరుద్యోగ యువత హలో ఆదివాసీ చలో చింతూరు ఐటిడిఎ కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో గాయపడిన సారా పాండురాజుని మంగళవారం రేఖపల్లిలో అతని నివాసానికి వెళ్లి సిపిఎం నాయకులు పరామర్శిం చారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సిపిఎం మండల కార్యదర్శి పులిసంతోష్‌కుమార్, ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్, పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామమూర్తి, వేటగాని సూరి తదితరులు పాల్గొన్నారు.


పాండురాజుని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

మారేడుపూడి భూములకు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని జీడిగుప్ప పంచాయతీ పరిధిలోని కోటారుకొమ్ములో సిపిఎం ముఖ్యులతో ముత్తిపోయిన స్వామి అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కదల కొండారెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులకు మారేడుపూడిలో 140 ఎకరాలు భూమి ఉందని వారికి పట్టాలు కూడా ఉన్నాయని అయితే వారికి ఇంతవరకూ పోలవరం నష్టపరిహారం ఇవ్వలేదని సంవత్సరాలు గడుస్తున్నా కాలయాపన చేస్తున్న అధికారులు భూమికి నష్టపరిహారం ఇవ్వకుండా కుంటిసాకులు చెబుతున్నారని నిర్వాసితులకు నష్టపరిహారం ఇచ్చారని మరి భూ యజమానులకు నష్టపరిహారం ఎందుకు ఇవ్వలేదనిప్రశ్నించారు. 18 సంవత్సరాలు నిండిన యువత అందరికీ రీ సర్వే చేసి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం పేరుతో మా కొండరెడ్డి గ్రామాలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. జీడిగుప్ప ,పోచవరం, ఇప్పురు గ్రామాలను కలుపుతూ రెండు పూటలా బస్సు నడపాలని ఆర్టిసి మేనేజర్‌ని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఖాదర్‌బాబు, పార్టీ సభ్యులు జోగిరెడ్డి సరోజిని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కదల కొండారెడ్డి

నకిలీ మద్యంపై వైసిపి దుష్ప్రచారం

టిడిపి మండల అధ్యక్షుడు గురుకు శేషుకుమార్

ప్రజాశక్తి -మారేడుమిల్లి: రంపచోడవరం అబ్కారీ శాఖ కార్యాలయం ముందు వైసిపి నాయకులు కల్తీ మద్యం గురించి నిరసన కార్యక్రమం చేయడం విడ్డూరంగా ఉందని తెలుగుదేశం పార్టీ మారేడుమిల్లి మండల అధ్యక్షులు గురుకు శేషుకుమార్ ఎద్దేవా చేశారు.ఎందుకంటే కల్తీ మద్యానికి కేరాఫ్ అడ్రస్ గత వైసిపి ప్రభుత్వం అని ఎందుకంటే జె బ్రాండ్ సృష్టికర్తలు గత వైసిపి నాయకులని నకిలీ మద్యం వల్ల వైసీపీ ప్రభుత్వంలో ఎంతోమంది మరణించారని ఆ పాపం వైసీపీ ప్రభుత్వానికి తగిలి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని కుటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నకిలీ మద్యాన్ని కుకటి వేళ్ళతో పెకిలుస్తుందని గతంలో నకిలీ మద్యంలో సంబంధం ఉన్న వారిని గత ప్రభుత్వం అందరం ఎక్కిస్తే కూటమి ప్రభుత్వం ఆరోపణలు ఎదుర్కొన్న వారిని సస్పెండ్ చేస్తున్నామని అత్యంత పారదర్శకంగా మద్యం విధానాన్ని అమలు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంతో గత ప్రభుత్వంలో అక్రమాలు బయటపడతాయని భయాందోళనలో గత వైసిపి ప్రభుత్వం అనవసరపు రాద్ధాంతం చేస్తుందని. ఈ అక్రమ ప్రకటనలు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ నూర్ భాషా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, జనసేన మండల అధ్యక్షులు మల్ల దుర్గాప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కర్రి సన్యాసిరెడ్డి, పాములేరు సర్పంచ్ సార్ల రమాదేవి, పుల్లంగి సర్పంచ్ వీరవల్లి జార్జిబాబు, మారేడుమిల్లి యూనిట్ ఇంచార్జ్ పాము రాంబాబు, కొరగాని ప్రశాంతరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు శేషుకుమార్

జిఎస్‌టిపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - అరకులోయ: అరకులోయ మండల కేంద్రంలో జిఎస్‌టిపై ప్రజల్లో అవగాహనకు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పద్మ విభూషణ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంప్లెక్స్ రోడ్డు జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పద్మ విభూషణ్ మాట్లాడుతూ, జిఎస్‌టి సంస్కరణల వల్ల భవన నిర్మాణ మెటీరియల్ రేట్లు, సిమెంటు,మార్బుల్ ఇసుక, సున్నం, పార్టికల్ బోర్డు, కాంక్రీట్ తదితర వంటి వాటి ధరలు తగ్గనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లవరాజు, ఎ.బాలరాజు, వర్తక సంఘం అధ్యక్షులు కాపుగంటి కృష్ణారావు, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రాజబాబు, స్థానిక వర్తకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దేశాన్ని పరివర్తన చేయడం - ఆవిష్కరణలు, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై మంగళవారం జాతీయ సదస్సు నిర్వహించరు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. విజయభారతి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రధాన వక్తలుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు డాక్టర్ కె.కనక కుమార్ చాంద్, డాక్టర్ కెవికె. చాంద్ పాల్గొన్నారు. వారు పరిశోధకుల పత్రాలను సమీక్షించి, భారతదేశ అభివృద్ధికి కావలసిన పరిజ్ఞానం, సంస్కరణల అవసరాన్ని ప్రస్తావిస్తూ పరిశోధకుల కృషిని అభినందించారు. విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పిఎం ఉష, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస పాత్రుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పెదబయలు : స్థానిక గిరజన సంక్షేమ బాలుర గురుకుల వసతి గృహంలో సోమవారం సాయంత్రం గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిమళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, ఆరోగ్యం, మెనో అమలు తీరు అడిగి తెలుసుకొన్నారు. వంటగది, మరుగుదొడ్లు పరిశీలించారు. ఉపాధ్యాయులు రాస్తున్న హ్యాండ్ టీచింగ్ బుక్స్ పరిశీలించారు. డార్మెటరీలను పరిశీలించి పరిశుభ్రంగా ఉండటంతో ప్రిన్సిపాల్ డి సూర్య శంకర్‌రావును, ఉపాధ్యాయులను అభినందించారు.

సిఐ శ్రీనివాస్‌కు సన్మానం

ప్రజాశక్తి- కొయ్యూరు: నూతనంగా నియమింపబడ్డ సిఐ శ్రీనివాస్‌ని కొయ్యూరు ఎంపిపి బడుగు రమేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొయ్యూరు, మంప పోలీస్‌స్టేషన్లకు శ్రీనివాస్ సిఐగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఎంపిపి రమేష్ కలసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. తదుపరి మండలంలో పలు విషయాలపై చర్చించారు. వైస్ ఎంపిపి అంబటి నూకాలమ్మ, సర్పంచులు రీముల శ్రీను, కోడా రాజబాబు, కుశల, నాగేంద్ర, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.


సిఐని కలసిన ఎంపిపి రమేష్

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- ఎటపాక: యువత గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎటపాక సిఐ యం.కన్నప్ప రాజు యువతకు సూచించారు. సిబ్బందితో కలిసి ఎటపాక మండలంలో యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో యువతతో మాట్లాడుతూ గంజాయికి బానిస కావద్దని దాని వలన కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. గంజాయి రవాణాపై సమాచారం తెలిస్తే దగ్గర్లో ఉన్న పోలీసువారికి సమాచారం అందించాలని కోరారు.

దుకాణం తొలగింపుపై ఫిర్యాదు చేస్తాం

ప్రజాశక్తి-విఆర్‌పురం:మండలంలోని వడ్డుగూడెం పంచాయతీ లో గల బిసి కాలనీలో డ్రైనేజీపై అడ్డుగా ఉందని తమ దుకాణం తొలగించారని ఈ విషయమై కలెక్టర్, ఎస్‌పికి ఫిర్యాదు చేస్తామని బాధితులు ఉంగుటూరు రమణయ్య, ఆయన భార్య అలివేలు పత్రికా ప్రకటనలో తెలిపారు. దుకాణం తొలగించిన డెబ్రిస్ కాల్వలో పడేశారని ఇప్పటి వరకూ తొలగించలేదని, కాలువపై అడ్డుగా ఉందని తొలగించిన వారు కాలువలో పడేయడమేంటని ప్రశ్నించారు. కలెక్టర్, ఎస్పికి ఫిర్యాదు చేస్తామని అక్కడ కూడా న్యాయం జరగకపోతే కోర్టుకు వెళతామని తెలిపారు.

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి-మారేడుమిల్లి: రంపచోడవరం నియోజకవర్గ స్థాయిలో మారేడుమిల్లి మండలానికి చెందిన బద్రి రాజు వలి రామ సీతదేవికి రూ.28,800 సిఎం రిలీఫ్ ఫండ్ నియోజకవర్గ ఎమ్మెల్యే శిరీష దేవి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మారేడుమిల్లి మండల అధ్యక్షులు గురుకు శేష్‌కుమార్, రాష్ట్ర నూర్ భాషా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, జనసేన మండల అధ్యక్షులు మల్లా దుర్గాప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కర్రి సన్యాసిరెడ్డి, పాములేరు సర్పంచ్ సార్ల రమాదేవి, పుల్లంగి సర్పంచ్ వీరవల్లి జార్జి బాబు, మండల యూనిట్ ఇన్చార్జ్ పాము రాంబాబు, కొరగాని ప్రశాంతరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన

ప్రజాశక్తి- వి.ఆర్.పురం: పెన్షన్, ఆధార్, రైస్‌కార్డు, ఉపాధి హామీ తదితర అంశాలపై ఎస్‌డిఎస్ సంస్థ చైర్మన్ ఉండవల్లి గాంధీబాబు ఆధ్వర్యంలో గిరిజన యువతకు పథకాల అమలుతీరుపై శిక్షణ తరగతులు నిర్వహించారని ప్రోగ్రామ్ నిర్వాహణ అధికారి రామ్ గోపాల్‌రావు వివరించారు. మంగళవారం ఎస్‌డిఎస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ హాస్పిటల్లో హెల్త్‌స్కీమ్స్, హెల్త్ ఇన్సూరెన్స్ గురించి వివరించామ న్నారు. తదుపరి కూనవరం మండల సిహెచ్‌సి వైద్యులు మహేష్, సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 40 గ్రామాల నుంచి 80 మంది యూత్ లీడర్స్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

ప్రజాశక్తి -చింతూరు : తమ గ్రామంలో పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీ కావడంతో తుమ్మల గ్రామస్తులు మంగళవారం వీడ్కోలు పలికి అభినందించారు. నాగేశ్వరావు మొత్తం రాజయ్య, యూత్ అధ్యక్షులు పాత్ర రమేష్ స్కూల్ చైర్మన్ ఉయిక రాంబాబు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.